క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



పుస్తకావిష్కరణలో ఎంపీ దగ్గుమళ్ల తదితరులు

చిత్తూరు కార్పొరేషన్ : నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో మంగళవారం ప్రధానమంత్రి పుట్టినరోజు సందర్భంగా జన జాగృతి సంస్థ, బీజేపీ నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు చేతులమీదుగా భవిష్య మార్గదర్శనం పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, నేతలు గురజాల చెన్నకేశవనాయుడు, సుబ్బారెడ్డి బ్రహ్మానందరెడ్డి, హరిబాబు చౌదరి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక చర్చివీధిలో ప్రజలకు బీజేపీ నేతలు జగదీశ్వర్‌నాయుడు, షణ్ముగం ఆధ్వర్యంలో మంగళవారం తులసి మొక్కలు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు శ్రీనివాసులు, గోకుల్ పాల్గొన్నారు.

రూ.1.29 లక్ష పలికిన లడ్డు



వినాయక నిమజ్జనంలో భక్తుల సందడి

కుప్పం: కుప్పం మున్సిపాలిటీ పరిధిలో రెండో వార్డు నారాయణపురం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన లడ్డు వేలం పాటలో రూ.1.29 లక్ష పలికింది. మంగళవారం వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలం వేశారు. ఈ వేలాన్ని నారాయణపురం గ్రామానికి చెందిన హనుమంతు కుమారులు ముత్తురాజ్, రమేష్ రూ.1,29,116 వేలంలో స్వామివారి లడ్డు దక్కించుకున్నారు.

ఉపాధి పనులు కల్పించాలి



మొక్కలు నాటుతున్న ఏపీడీ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఉపాధి పథకంలో కూలీలకు పనులు కల్పించాలని జిల్లా డ్వామా అదనపు పీడీ శ్రీనివాసులు అన్నారు. అయన మంగళవారం రొంపిచెర్ల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఉపాధి పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం కూలీల వలసలను నివారించడానికి ఉపా ధి హామీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. రైతుల భూముల్లో పండ్ల తోటలను పెంచుకోవచ్చన్నారు. బంజరు భూములను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. మండలంలో 2023–24 సంవత్సరానికి 1,803 పనులకు రూ.8.95 కో ట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఈ పనులకు ఆడి ట్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. రికార్డు నమోదులో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు. ఇందుకు రూ.12వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఉపాధిలో ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండల కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా విజిలెన్స్ అధికారి గంగాభవాని, ఎంపీడీఓ రెడ్డెప్పఆచారి, ఏపీఓ బాలమురళి పాల్గొన్నారు.

వైభవంగా అనంతపద్మనాభ వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం ఆర్యవైశ్యులు సామూహికంగా అనంతపద్మనాభ వ్రతాన్ని ఆచరించారు. వివిధ రకాల సుగంధ పుష్పాలతో అలంకరించిన మండపంపై అనంతపద్మనాభస్వామిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. రామక్రిష్ణమాచార్యులు అనంతపద్మనాభస్వామి వ్రత కథ చదివి భక్తులకు వినిపించారు. కొంతమంది గృహాల్లో అనంతపద్మనాభస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

పేద విద్యార్థులంటే చిన్నచూపు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసినట్లయితే ఎంబీబీఎస్ చదవాలనే పేద విద్యార్థుల భవిష్యత్ చిన్నాభిన్నం అవుతుంది. పేద విద్యార్థుల్లో ఎంబీబీఎస్ చేసి వైద్య రంగంలో ప్రజలకు సేవలందించాలనే కోరిక ఉంటుంది. కానీ అలాంటి విద్యార్థులకు చదువుకునే స్తోమత ఉండదు. పేద విద్యార్థుల కలలను నెరవేర్చడం కోసమే గత ప్రభుత్వంలో కొన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఈ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థుల కలలను అడియాశలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. అలాంటి ఆలోచనలు ఈ ప్రభుత్వం మానుకోవాలి.

– పట్టాభిరామయ్య, కల్లుపల్లి



సీట్లు తగ్గినందునే కటాఫ్ పెరిగింది



ఎంబీబీస్ సీట్లు తగ్గినందునే ఈ దఫా కటాఫ్ పెరిగింది. అదే ప్రభుత్వ సీట్లు వచ్చుంటే తక్కువ మార్కులున్న వారికి వైద్యవిద్యలో అవకాశాలుండేవి. ఈ ప్రభుత్వ నిర్ణయాలు ప్రైవేటు కళాశాలలకు, డబ్బున్న వారికి సీట్లు పొందేందుకు అవకాశంగా మారాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డాక్టర్లు పెరగాలి. ఇందుకోసం సాధ్యమైనంతగా ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో మెడికల్ సీట్లు పెంచాలి. కానీ ఈ ప్రభుత్వంలో సీన్ రివర్స్‌గా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.

– గజేంద్ర, పేరెంట్, తొప్పనపల్లి

కూరగాయలు వితరణగా అందిస్తున్న దాత గంగాధర్



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయని



అలరించిన సాంస్కృతికం

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- వరసిద్ధునికి విరాళం అందించిన పలువురు దాతలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. వృద్ధులు, చంటి బిడ్డల తల్లులను ప్రత్యేక క్యూలైన్‌లో దర్శనానికి అనుమతించారు.

నిత్యఅన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వినాయకస్వామి ఆలయ నిత్యఅన్నదాన ట్రస్ట్‌కు ఒంగోలుకు చెందిన దాత ప్రత్యూష రూ.1,00,116 విరాళం అందజేశారు. వీరికి టెంపుల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



భరతనాట్యం చేస్తున్న కళాకారిణి



ఊరేగుతున్న స్వామివారు

కూరగాయల వితరణ

నిత్యఅన్నదానానికి చింతామణికి చెందిన దాత గంగాధర్ సుమారు 2.5 టన్నుల 12 రకాల కూరగాయలను అందజేశారు. వీరికి అన్నదాన సూపరింటెండెంట్ బాల రంగస్వామి, మునిరామయ్య స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాంస్కృతిక నీరాజనం

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలలో కళాకారులు స్వామివారికి సాంస్కృతిక ప్రదర్శనలతో నీరాజనం పట్టారు. ప్రత్యేక ఉత్సవాలలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు ఆలపించిన భక్తి గీతాలు, ప్రద

నేడు రావణబ్రహ్మ వాహనం

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు రావణబ్రహ్మ వాహనంపై ఊరేగనున్నారు. ఉదయం మూలస్థానంలోనే గణనాథుడికి అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శం కల్పించనున్నారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

ర్శించిన భరతనాట్యం, పౌరాణిక నాటకం భక్తులకు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ గురుప్రసాద్ పాల్గొన్నారు.

గణనాథుని సేవలో డోన్ ఎమ్మెల్యే

వినాయకస్వామిని కర్నూలు జిల్లా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



నిత్యఅన్నదాన ట్రస్ట్‌కు విరాళం అందించిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

‘స్వచ్ఛత’ దిశగా అడుగులు

చిత్తూరు అర్బన్ : నగరవాసులు స్వచ్ఛత దిశగా అడుగులు వేయాలని మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయ ఆవరణంలో అధికారులు, ఉద్యోగులు 'స్వచ్ఛత ప్రతిజ్ఞ' చేశారు. మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను, తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛతాహీ సేవను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందు లో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోనూ అక్టోబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. నగరపాల క అధికారులు, ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధు లు, ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములుకావాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈ గోమతి, డీఈ వెంకట ప్రసాద్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: ప్రతి పల్లెను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం పూతలపట్టులో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ–2024 కార్యక్రమంలో భాగంగా మానవహారంగా ఏర్పడ్డారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రీన్ అంబాసీడర్లకు జెడ్పీ సీఈఓ గ్లోరియాతో కలిసి కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మీ, ఎంపీడీఓ ధనలక్ష్మీ, తహసీల్దార్ గుర్రప్ప, సీఐ కృష్ణమోహన్, స్థానిక నేత దొరబాబు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు



గ్రీన్ అంబాసిడర్లకు కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, జెడ్పీ సీఈఓ గ్లోరియా

అవగాహన ర్యాలీ చేస్తున్న ఆలయ అధికారులు



కాణిపాకం.. పరిశుభ్రం

ఐరాల/తవణంపల్లె: వినాయకస్వామి ఆలయ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వినాయక సదన్, 100 అడుగుల రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ

వి.కోట: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ బాబు సూచించారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సిబ్బందితో కలసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా కారు డ్రైవ్ చేయడం నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. వివిధ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐ జయకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి



తిమ్మోజుపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ రాష్ట్ర కమిషనర్ శ్రీనివాసులు

- రైతులతో ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు

బంగారుపాళెం: మామిడితో పాటు ఉతర ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. మంచిత్తూరు నుంచి కుప్పం వెళ్తూ మార్గం మధ్యలో మండలంలోని తిమ్మోజుపల్లెలో మంగళవారం ఆయన మామిడి తోలను పరిశీలించారు. రైతులతో ముచ్చటించారు. మామిడి తోటలతో రైతులు ఆదాయం పొందుతున్నారా, లేదా? పంట దిగుబడి ఎలా ఉంటోంది? అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ–పంట నమోదు ప్రక్రియ ఎలా ఉంటోందని ఆరా తీశారు. అనంతరం రైతు మామిడి తోటలో నిర్మిస్తున్న మామిడి కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు.

రైతులు ఆదాయాన్నిచ్చే పంటల సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వ పరంగా చేయూతను ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ అసిస్టెంట్ పీడీ ఫసలున్నీసా బేగం, మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

‘నులి’ నివారణే లక్ష్యం

గుడిపాల: నులి పురుగుల నివారణే లక్ష్యంగా మాత్రలు అందిస్తున్నట్లు ఎంఈఓ హసన్‌బాషా తెలిపారు. మంగళవారం నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 2 నుంచి 19 ఏళ్ల పిల్లలందరూ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖాదర్, వైద్యసిబ్బంది చంద్రశేఖర్, జబసెల్వి, విజయ, ఉమ, సుజన, స్వప్న పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

తవణంపల్లె: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగుల నివారణ తప్పనిసరని, అందుకోసం ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు మొత్తం 8,414 మంది ఉండగా 8,175 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు వివరించారు. మిగిలినవారికి బుధవారం ఇంటింటికీ వెళ్లి మాత్రలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులరెడ్డి, సీహెచ్‌ఓలు రాజామణి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



గుడిపాల : మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు

అన్నదానం

బంగారుపాళెం : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బంగారుపాళెం బస్ స్టాండ్ వద్ద బీజేపీ నేతలు జగదీశ్వర్‌నాయుడు, భానుప్రకాష్, రాజేష్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు శరత్, గోపీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్ కన్నుమూత

బంగారుపాళెం: మండలంలోని ముంగరమడుగుకు చెందిన పాస్టర్ జాన్ మంగళవారం అనారోగ్యంతో కన్నుమూశారు. సుమారు 45 ఏళ్లపాటు సువార్త సభల్లో ఆయన సందేశమిచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. జాన్ పార్థివదేహాన్ని పలువురు పాస్టర్లు సందర్శించి నివాళులర్పించారు. జాన్ కుటుంబీకులకు సంతాపం తెలిపారు.